
# తిలదానం



## రెంటాల నాగేశ్వరరావు

ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 10.4.1991 సంచికలో ప్రచురించిన ఈ కథకు, ఆ ఏడాది ఉగాది కథల పోటీలో ప్రోత్సాహకబహుమతి వచ్చింది

భాగ్యనగరం నిద్దరోతోంది. ఆస్తి కోసం తమలో తామే ఒకరినొకరు చంపుకుని తల్లి గర్భానికి చిచ్చు పెట్టిన తనయులను తలచుకుని రోదించి, అలసిసొలసి మూర్ఛ లాంటి స్థితిలోకి వెళ్లిన తల్లి మనసులా, మతకల్లోలాల్లో బిడ్డలను పోగొట్టుకున్న భాగ్యనగరం నిద్దరోతోంది.

ఆమె ఎండిన కన్నీటి చారికలా ప్రవహిస్తోంది మూసీనది.

అర్ధరాత్రి. దాదాపు రెండు గంటల సమయంలో చాదర్‌ఘాట్ వంతెన నుంచి క్రీనీడల్లో నడుస్తూ ముందుకెళుతున్నాడో ముప్పైనాలుగేళ్ల వ్యక్తి. అతడి తలకు ప్రభుత్వం వారు ప్రకటించిన బహుమానం ఏభైవేలు! ఒక మంత్రిగారు కేవలం కమిషన్ కోసమే కొన్న మరెవరూ కొనని జేగురురంగు నియాన్ లైట్ల కాంతిలో అతడి దుస్తులు మసకమసకగా చీకటిలో కలిసే రంగులో కనిపిస్తున్నాయి. పెరిగిన గడ్డం, నలిగిన లాల్చీపైజామా, భుజాని కో గుడ్డ సంచీ, పీక్కుపోయిన కళ్లు-అదీ అతడి ఆకారం. సన్నగా, పొడుగ్గా వున్న ఆ వ్యక్తిని పట్టిస్తే-సజీవంగా గాని, నిర్జీవంగా గాని-ఏభైవేలు బహుమతి లభిస్తుందని ఎవరూ ఊహించలేరు. మసక చీకట్లో ఇస్లామియా బజార్ వేపు నడుస్తున్నాడా యువకుడు. బొడ్లో పిస్టల్ లోడ్ చేసే వుంది.

ఇస్లామియా బజార్ అంటే-ముస్లింలు వుండే ప్రాంతం అనుకుంటే పొరపడ్డట్లే. అది బ్రాహ్మణవీధి. పౌరోహిత్యమే జీవనోపాధిగా నివసించే వైదికకుటుంబా లుండే వీధి అది.

సందులలో తిరుగుతూ ఒక పక్కగా వున్న చిన్న పెంకుటింటి తలుపు మెల్లగా తట్టాడా వ్యక్తి, నలువైపులా ఒకసారి చూసి.

ముందు దగ్గు, తరువాత ఆయాసంతో కూడిన స్వరం నీరసంగా అడిగింది-"ఎవరూ?" అని.

"నేనే... రఘురాంని" గుసగుసగా అన్నాడా యువకుడు.

కుక్కి మంచం కిర్రుమన్నది. తరువాత మూడు కాళ్ల భారమైన నడక. మెల్లిగా తలుపు తీసిన శబ్దం.

రఘురాం లోనికి చూశాడు. బెడ్ లైట్ మసక వెలుగులో కూడా తండ్రి ముఖంలో వర్చస్సు, నున్నని తల వెనుకకు ముడి వీడి జారిన శిరోజాలు, విశాలఫాలభాగం పైన చెదరిన విభూతిరేఖలు, మెడలో రుద్రాక్షమాలలు, నీర్కావి పంచె, నిష్కల్మషమైన చూపులు, కిందకు సాగిన చెక్కిళ్లు... వృద్ధాప్యంలో విషాదం పెంచిన తెల్లటి గడ్డం, పీక్కుపోయిన బుగ్గలు.

రఘురాం కళ్లలో నీళ్లు నిలిచాయి.

"ఎవరూ?" కనుబొమల పైన ఎడమచేతిని వుంచి చూస్తూ అన్నాడాయన.

ఒకప్పుడాయన-నాలుగు వేదాలూ పుక్కిటబట్టిన మహాపండితుడు. బ్రహ్మశ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రి గారునేడు తిలదానం స్వీకరించే సుబ్బయ్య.

"నేను నాన్నగారూ-రఘురాంని!" తలుపు తీసుకుని లోపలకు వచ్చి తలుపు మూస్తూ అన్నాడు రఘురాం.

"నీవా? అప్రాచ్యుడా! ఎందుకు వచ్చావ్? నన్నీ ముసలితనంలో కూడా సుఖంగా చావనీయవా?" అడ్డు తప్పుకుని కుక్కి మంచంలో కూలబడుతూ అన్నాడు.

"పద్మ ప్రసవించిందా?" ఆత్రుతగా అడిగాడు రఘురాం.

"ఆ! మగబిడ్డ. మూలానక్షత్రంలో పుట్టాడు. పెద్ద శాంతి చేయాలి" ఉస్సురని నిట్టూరుస్తూ అన్నాడాయన.

ఒకే గదిలో మధ్యగా అడ్డుగా కట్టిన దుప్పటిని తొలగించి లోపలికి చూశాడు రఘురాం. నేల పైన పడుకుని వుంది పద్మ. పద్మ అతడి అర్ధాంగి. మాగన్నుగా నిద్దరోతోంది. నోటితో ఒక స్తనాన్ని నిద్రలోనే చప్పరిస్తున్నాడు పసిగుడ్డు.

"పద్మా!" ముంగాళ్ల పైన కూర్చుని మెల్లిగా ఆమెను తట్టాడు రఘురాం.

ఉలిక్కిపడి కళ్లు తెరిచి, భర్తను చూసి రవిక సరిజేసుకుని, బిడ్డను గుండెలకు హత్తుకుంటూ, లేచి కూర్చుని అందా ఇల్లాలు "మీరా?" అని. ఆమె కళ్లలో ఆనందం, దుఃఖంతో కూడిన కన్నీళ్లు, కంఠంలో మార్దవం, తనువులో సన్నని వణుకు, గుండెలో అలజడి వున్నాయి.

"నేనే పద్మా! బావున్నావా? ఏదీ బాబునివ్వు" పద్మావతి చేతిలోంచి పసిగుడ్డును అందుకుని, హృదయానికి హత్తుకున్నాడు రఘురాం. ఆబగా ఆ బిడ్డ నుదుటి పైనా, గుండె పైనా చుంబించాడు. చిన్ని చిన్ని చేతులనూ, కాళ్లనూ ప్రేమగా నిమిరాడు. అతడి కళ్లు చెమ్మగిల్లాయి.

"ఏవండీ! మీ కోసం నాలుగు రోజుల నుండీ పోలీసులు తిరుగుతున్నారు. మళ్లీ వస్తారేమో?" అంది పద్మ భర్త భుజం పైన తల వాల్చి.

ఆమె కన్నీటితో అతడి గూడ తడిసిపోతోంది. అప్రయత్నంగా అతడి చేయి పిస్టల్‌ని సర్దింది. తరువాత భార్యను అక్కున చేర్చుకున్నాడు.

"ఇలా ఎంత కాలం మా నుంచి దూరంగా వుంటారండీ? ఉండి ఏం సాధిస్తారు? బిడ్డడికి జ్వరం. ఇంట్లో చిల్లిగవ్వ లేదు. మామగారు నక్షత్రం మంచిది కాదు, శాంతి జరిపించి తీరాలంటున్నారు." మెల్లిగా అంటున్నా-ఆమె గొంతు వణుకుతోంది భయంతో.

నిట్టూర్చాడు రఘురాం. "నే చెప్పినా నీకర్థం కాదు పద్మా! నేను నా కోసం బాధపడటం లేదు. ఈ సమాజం కోసం..."

"కుటుంబాన్ని ఉద్ధరించటం చేత కాదు గాని, దేశాన్ని ఉద్ధరిస్తాడట దేశాన్ని!" ఉక్రోషం పట్టలేక అన్నాడు సుబ్రహ్మణ్యశాస్త్రి. "కన్నబిడ్డకు గ్లాసెడు పాలు తేలేడు కాని, దేశంలో అందరికీ తిండి పెడతాడట!"

బిడ్డని ముద్దాడి పద్మ చేతికిచ్చి ఇవతలి కొచ్చాడు రఘురాం. తండ్రికేసి సూటిగా చూశాడు. "నాన్నగారూ! మీరు చదివిన వేదవేదాంగాలు మీకీ నాడు తిండి పెడుతున్నయ్యా? వంశానుగతంగా వేదాలు పుక్కిటబట్టి వాటిని నేటి వరకూ కాపాడుతూ వచ్చిన ఈ వేదభూమి మీకేం ఇచ్చింది? మా చెవుల్లో సీసం పోశారు. వేదాలు మా కందకుండా చేశారు-అని మీ కులాన్ని వేలెత్తి చూపే ఈ సమాజంలో ఎందరు ఈ నాడు వేదం నేర్చుకుంటున్నారు? ఎవరు పౌరోహిత్యాన్ని కులవృత్తిగా స్వీకరిస్తున్నారు? తిరుపతి, మంత్రాలయం దేవస్థానం వారు అన్ని కులాల వారికీ వేదాలు నేర్పుతామంటున్నా ఒక్కరూ ముందుకు రారేం?

"అగ్రవర్ణం వారు మిగతావారిని నీచంగా చూశారంటున్నారు. ఊరికి ఒకటి రెండిళ్లు వుండే మీరు-స్వతహాగా సాత్వికులు, భయం అధికంగా కలవారు. మీరెవర్ని నీచంగా చూశారు? మీ రేనాడూ రాజ్యాలు ఏలలేదే! అధికారమే లేని మీరు ఎవర్ని ఏం చేశారు? ఏదో రాజులు దయ తలచి ఇచ్చిన అగ్రహారాలు పాలకూ, నేతికీ అమ్ముకున్న మీరు-ఆ వేదాలనే నమ్ముకున్న మీకు ఆ వాఙ్మయకటాక్షం తప్ప, లక్ష్మీప్రసన్నం కాని మీ తరాల చరిత్ర గతి ఏమిటి? ఫ్యూడల్ సమాజంలో ఏదో ఒక కులాన్ని తప్పు పట్టి, మరో కులం పైకి రావాలని ప్రయత్నిస్తుంది తప్పితే-సమాజోద్ధరణ జరగదు! వేదాలూ, పురాణాలూ వల్లించే మీ బోటి వారికి గతితార్కికవిధానం అర్థం కాదు!" అన్నాడు ఆవేశంగా.

"ఆపరా నీ ఉపన్యాసం! ఏమిటిరా నీవు సాధిస్తున్నది? పోలీసులంటే భయంతో ప్రాణాలు అరచేత బట్టుకుని అడవుల్లో తిరుగుతున్నారు. బస్సుల్ని కాల్చేసి, నాయకుల్ని కిడ్నాప్ చేసి ప్రభుత్వాన్ని బెదిరించి ఏం సాధిస్తున్నారు? వారి కుటుంబాలు ఎంత బాధ పడుతున్నాయో మీకు తెలుసా? సారాయి ధర తగ్గించగానేబలవంతాన కొన్ని తీర్పులు అమలు జరిపినంత మాత్రాన, ఒక భూస్వామిని చంపినంత మాత్రాన, బంజరు భూముల్ని పేదలకు పంచినంత మాత్రాన-[illegible]

## పింగాణీ పరిశ్రమ
## ఒక సజీవకళ



చైనాలో పింగాణి పుట్టి ఆ తరువాత పశ్చిమదేశాలకు విస్తరించింది. పూర్వం పాశ్చాత్యప్రపంచంలో పింగాణీ వస్తువులను, వెండినగలంత విలువైనవిగా చూసుకునేవారు.
14వ లూయి చక్రవర్తి వెండి ఆభరణాలను కరిగించి వాటి స్థానే పింగాణీ పస్తువులను తయారుచేయించాడు. జర్మన్‌రాజులు ఈ పింగాణీ తయారీ రహస్యాన్ని తెలుసుకోమని రసవాదులను కోరారు.

పింగాణి రాజుల స్థాయినుండి ప్రజల స్థాయికి పందొమ్మిదవ శతాబ్దంలో వచ్చింది. పింగాణీ తయారీకి పోర్సులిన్ బంకమట్టి అవసరం. పింగాణీతో కాగితం దళసరిలో కూడా వస్తువులను తయారుచేయగలరు.

పింగాణీ ఆవిర్భవించి రెండువేల సంవత్సరాలు అయినా పింగాణీకళ సజీవంగానే ఉంది. కొత్తపుంతలు తొక్కుతోంది. అందుకే పింగాణీ పరిశ్రమ కేవలం ఒక పరిశ్రమేకాదు అదొక సజీవకళ అంటున్నారు ఈ రంగంలోని పరిశీలకులు.

సి.వి. సర్వేశ్వరరావు

పాలకులనే అపహరించండి! సారాయి, సిగరెట్లు, ఉత్పత్తికి పనికి రాని సినిమాలు ఉదయం, మాటినీ ఆటలు లేకుండా చేయండి! అంతేగాని భోటానాయకులనూ, అధికారులనూ అపహరించో, సంహరించో మీరు సాధించేదేముంది?"

"అది మీకర్థం కాదు లెండి నాన్నగారూ! ఇది తొలిమెట్టు. ప్రజలు చైతన్యవంతులైతే సమసమాజం వస్తుంది. ఆ నాడు ఎవరూ మీలా, మీలాంటి చాలామందిలా తిండికీ, బట్టకూ బాధపడే రోజులు పోయి-సుఖంగా బ్రతికే రోజులొస్తాయి."

గాఢంగా నిట్టూర్చాడు సుబ్రహ్మణ్యశాస్త్రి. "మార్క్స్‌ని మీరు చదివి నిజంగా అర్థం చేసుకున్నారా?" పెదవి విరిచాడాయన. "భారతదేశం లాంటి దేశాల్లో సమసమాజస్థాపన సాధ్యం కా దన్నాడాయన. మొరిగే కుక్కకు రొట్టిముక్క వేస్తే చాలు నోరు మూసుకుపడుంటుంది. అలాటిదే మన దేశప్రజ. ఈ దేశంలో ఎవరూ రష్యాలోలానో, చైనాలోలానో తిండి కోసం తిరగబడరు! 'ఆకలి' అని అరిస్తే ఒక ముద్ద భిక్ష వేస్తారు. 'ఇల్లు' అని అరిస్తే సత్రాలు కట్టిస్తారు. 'బట్ట' అని అరిస్తే జనతావస్త్రాలిస్తారు. 'పని' అని అరిస్తే నిజంగా ఇవ్వాల్సిన జీతంలో సగం ఇస్తూ పని చూపిస్తారు-లేదా ఒక రోజుకు సరిపడే భత్యం నెలకు ఇస్తారు-లేదా చవకగా బియ్యం, గోధుమలు ఇస్తారు. ఎవరైనా తెలివితేటలుంటే గొప్పవారు కావచ్చు. దాని కన్ని అవకాశాలున్నాయి అని ఆకాశహర్మ్యాలు, ఇంపోర్టెడ్ కార్లు చూపిస్తారు.

"ఇంకెలా వస్తుందిరా విప్లవం? నీలాటి వారు మిడిమిడిజ్ఞానంతో ఏవేవో కలలు కంటూ, ప్రజలకు దూరంగా వుంటే ప్రజలెలా చైతన్యవంతు లవుతారు? 'దాస్ కేపిటల్' చదివిన పెద్దలు తెలుసుకోవాల్సింది-'ప్రజలు ఎలా మోసపోతున్నారు? దాన్నెలా అరికట్టాలా' అని కాని, అది తెలుసుకున్న వారే ఈ నాడు పెద్ద ధనవంతులయ్యారు. ఎందుకంటే వారికి ప్రజల నెలా మోసం చేయాలో తెలుసు కనుక. ఈ ఆంధ్రప్రదేశ్‌లో మరో సుందరయ్యను చూపించు! ప్రకాశం పంతులు గారిని చూపించు! నంబూద్రిపాద్ లాంటి వారిని చూపించు! ఆస్తి కూడబెట్టేవారే కాని, వదులుకున్న నేత లెవరురా? కులాలు ముఖ్యపాత్ర వహించని, అగ్రస్థానంలో పెత్తనం చేయని రాజకీయ పార్టీలు చూపించు! కులాల పేరిటా, మతాల పేరిటా జనం చీలిననాడు-నీవు కలలు గనే జనజాగృతి సాధ్యం కాదురా!" బాధగా అన్నాడాయన.

"అది నాకు తెలుసు నాన్నగారూ! ప్రజాజాగృతికే మా ప్రయత్నం. అందులో-ఆ మహాయజ్ఞంలో కొందరు సమిధలు కాక తప్పదు! మా ప్రాణాల గురించి మేం ఆలోచించటం లేదు! మేం కలలు గనే సమాజం మేం చూడలేకపోవచ్చు. కానీ, మా తరువాతి తరం అనుభవిస్తుంది. చెట్లు నాటినవాడే పండ్లు తినలేకపోవచ్చు."

పెదవి విరిచాడు సుబ్రహ్మణ్యశాస్త్రి.

"ఇదో నాన్నగారూ, ఈ డబ్బు వుంచండి." ఒక నోట్ల కట్ట తీసి ఇవ్వబోయాడు రఘురాం.

"ఆ రక్తపుసొమ్ము నాకొద్దురా! వేదవేదాంగాలూ, అష్టాదశపురాణాలూ వల్లె వేశాను. చరిత్ర ఇచ్చిన సాహిత్యం చదివాను. మారుతున్న కాలాన్ని గమనిస్తూనే వున్నాను. ఆంధ్రాంగ్ల సంస్కృతాలలో అనర్గళంగా మాట్లాడగలను నేను. యజ్ఞయాగాదిక్రతువులూ, వివాహాది శుభకార్యాలు, అపరకర్మలూ చేయించగలను.

"నేను బ్రతికే విధానం తెలుసా నీకు? తిలదానం స్వీకరించటం, శవవాహకుడిని కావటం, తిరిపెమెత్తటం, యజ్ఞోపవీతం నాకో అర్హత నిచ్చింది. సాత్వికత నిచ్చింది. ముప్పొద్దులా సంధ్య వారుస్తూ, సహస్రగాయత్రి జపించే నన్ను-ద్విజుడనైనా, యజ్ఞోపవీతాన్ని తెంపివేసి, సాత్వికతను వర్జించి, హింసామార్గాన్నెంచుకుని నన్ను పుత్రహీనుడుగా చేశావు. ఈ యజ్ఞోపవీతం నాకు తిరిపెమెత్తే అర్హత కూడా ఇచ్చింది. అదైనా చేయుగలను కాని, నీ నెత్తుటి కూడు నేనంటలేను!"

అంతలో దూరంగా పోలీస్ విజిల్, బుల్లెట్ల శబ్దం వినిపించాయి.

"వస్తాను" అంటూనే ఒక్క గంతులో వాకిలి దాటి చీకట్లో కలిసిపోయాడు రఘురాం.

కళ్ల నీరు తుడుచుకున్నాడు సుబ్రహ్మణ్యశాస్త్రి.

బిడ్డను అక్కున చేర్చుకుని మౌనంగా రోదిస్తోంది పద్మావతి. పాలు రాని స్తనాన్ని చప్పరిస్తోందామె బిడ్డ.

తలుపు దగ్గరగా వేసి వచ్చి కుక్కి మంచంలో కూలబడ్డాడు సుబ్రహ్మణ్యశాస్త్రి. ఆయనకు నిద్ర పట్టటం లేదు. కోడలిని ఓదార్చే గుండె దిటవు ప్రస్తుతం లేదు. ఆలోచిస్తూ కూర్చున్నాడు.


కృష్ణాజిల్లాలోని కూచిపూడి భరతనాట్యానికి కాదు, వేదవిద్యకు కూడా ప్రసిద్ధి. ఒక శ్రోత్రియకుటుంబంలో జన్మించాడు సుబ్రహ్మణ్యశాస్త్రి. అగ్రహారికులు కనుక తిండికి లోటు లేదు. వేదవేదాంగాలు, అష్టాదశపురాణాలూ, ఆంగ్లం చిన్నతనంలోనే నేర్చుకున్నాడాయన. పండితుడుగా ఆ జిల్లా అంతటా ప్రసిద్ధి పొందాడు. వేదవిద్యలో తిరుగులేని పండితు డనిపించుకున్నాడు. అతడికి కలిగిన ఏకైకసంతానమే రఘురామశాస్త్రి.

కాలక్రమేణా అగ్రహారాలు కరిగిపోయాయి. వేదవిద్యకు విలువ నశించింది. పౌరోహిత్యం వచ్చినా, చేయటానికి ఆయనకు అహం అడ్డం వచ్చింది.

రఘురామశాస్త్రికి వేదవిద్యలు ఒంటబట్టలేదు. డిగ్రీ పూర్తయ్యేసరికి అర్థికశాస్త్రంతోపాటు మార్క్స్, మావోల సిద్ధాంతాలు కూడా చదివాడు. బ్రతుకు తెరువు కోసం ఉద్యోగప్రయత్నం చేస్తే దొరకలేదు. అప్పుడే పద్మావతితో వివాహమైంది. పొట్ట కోసం జంటనగరాలకు చేరాడు.

భార్య చనిపోవటంతోనూ, తన పాండిత్యానికి విలువ తగ్గటంతోనూ, అదో రకమైన విరక్తితో హైదరాబాద్-కొడుకు దగ్గరకు చేరుకున్నాడు సుబ్రహ్మణ్యశాస్త్రి. నిరుద్యోగిగా విప్లవసాహిత్యం అధ్యయనం చేశాడు రఘురామశాస్త్రి. ఉన్నవాడూ, లేనివాడూ లేనివాడిని, ఎలా దోచుకుంటున్నారో తెలుసుకున్నాడు. మార్క్స్ వ్యభిచారిణుల గురించీ, బిచ్చగాళ్ల గురించీ ఎందుకు చెప్పలేదో అర్థం చేసుకునే స్థితికి మానసికంగా ఎదిగాడు. కాని, ఆర్థికంగా క్రుంగాడు.

పొట్ట కోసం రైల్వేలో కాజువల్ లేబర్‌గా చేరాడు. చూస్తుండగానే తోటి కార్మికుల్లో కొందరు పర్మనెంటైనారు. అతడికి ఉద్యోగం రాకున్నా అతడి క్లాస్‌మేట్స్‌కి ఆఫీసర్లుగా ఉద్యోగాలు వస్తే సహించిన రఘురామశాస్త్రిలో మత్సరం ఏర్పడ్డది. అతడు పనిచేసే లోకో షెడ్‌లోనే తోటి కార్మికులు ఫైర్‌మెన్ అయ్యారు. అతడి మీదే



పెత్తనం చలాయించటం ప్రారంభించారు. అతడికి కాజువల్ లేబర్‌గా పర్మనెంట్ అయేసరికి వారు రైలు ఇంజన్ డ్రయివర్లుగా, డీపీ డ్రయివర్లుగా, ఎలక్ట్రికల్ ఇంజన్ డ్రయివర్లుగా ప్రమోషన్ పొందారు.

ఉక్రోషంతో, ఉద్రేకంతో అతని మనసు ఊగిపోయింది. సంఘం పెట్టాడు. సమ్మెలో పాల్గొన్నాడు. ఉద్యోగం పోయింది. జీవనోపాధికి ఎన్నో విధాల ప్రయత్నించాడు. ప్రయత్నాలేవీ ఫలించలేదు. ధనవంతులు మరీ ధనవంతులవుతున్నారు, పేదవారు మరింత పేదలవుతున్నారు.

సమసమాజస్థాపనకు నడుం బిగించాడు. తండ్రీ, భార్యా బంధాలు తెంచుకుని విప్లవసేనలో చేరాడు. అతడికి 'నక్సలైట్' అనే ముద్ర వేసింది ప్రభుత్వం. అడపాదడపా తండ్రినీ, భార్యనూ చూడటానికి వచ్చేవాడు, అంతే!

పై గుడ్డతో కళ్లు తుడుచుకున్నాడు సుబ్రహ్మణ్యశాస్త్రి. కొడుకు వెళ్లిపోయాక జీవనభృతి కోసం ఆయన పోరాటం మొదలుపెట్టాడు. 'ఒక వూరి కరణం మరో వూరి వెట్టి' అన్నట్లు ఆయన పాండిత్యం హైదరాబాద్‌లో ఎవరూ గుర్తించలేదు. సమర్థత కంటే, వేషభాషలకూ, మాయమాటలకూ పెట్టింది పేరా నగరంలో.

ఆయనను బ్రాహ్మణార్థానికి కూడా పిలిచేవారే కరవయ్యారు. తనంటే వస్తువుండగలడు కాని, కోడలు? ఆయన హృదయం తరుక్కుపోయింది. అప్పటికి మూడు రోజులుగా పొయ్యిలో పిల్లి పడుకునే వుంది.

బ్రహ్మశ్రీ వేదమూర్తులైన సుబ్రహ్మణ్యశాస్త్రి గారు సుబ్బయ్యగా మారాడు. తిలదానం స్వీకరించటానికైనా సిద్ధపడ్డాడు. శవవాహకుడైనాడు. తిరిపమెత్తాడు. శనిదానం అందరు బ్రాహ్మణులూ తీసుకోరు. అదేదో పాపమని వారు భావిస్తారు. సకలశాస్త్రపండితుడైన సుబ్రహ్మణ్యశాస్త్రికి దానిలో తప్పు కనిపించలేదు. శవవాహకునిది కూడా ఎంతో పవిత్రమైన వృత్తేనని ఆయన నమ్మకం. ముస్లిములలో శవం దారిన వెళుతుంటే తమ పని ఆపుకొని, శవపేటికను భుజాని కెత్తుకొని నాలుగడుగులు వేసి కాని వెళ్లరు. ఎంత పవిత్రమైన ఆచారం! అది బ్రాహ్మణులలో నీచవృత్తి!

ఉచ్చనీచభేదాలు సామాన్యులకు కానీ, ఆయన లాంటి సకలజ్ఞానసంపన్నుడికి కావు. ఆయన తన పాండిత్యం గురించి ఎవరికీ చెప్పుకోలేదు.

'తిలదానం సుబ్బయ్య' అయినా, 'బ్రహ్మశ్రీ వేదమూర్తులైన సుబ్రహ్మణ్యశాస్త్రి' అయినా ఆయన దృష్టిలో ఒకటే!

000

ఎనిమిదింటికల్లా పంచె కట్టుకుని, విభూతి పులుముకొని, దర్భలు చంకలో పెట్టుకుని, చిన్నసంచిలో పంచాంగం పెట్టుకుని బారులు తీరి కూర్చున్నారు బ్రాహ్మణులు-ఇస్లామియా బజార్‌లోని అరుగుల పైన. చీకట్లో కూడా నల్లకళ్లజోడు పెట్టుకునే ఆయన ఒకడైతే, మరొకడు ప్రతిక్షణం కారాకిళ్లీ నమిలేవాడు. కొందరు నడిచి అక్కడికి చేరితే, కొందరు మోపెడ్ పైనా, స్కూటర్ పైనా అక్కడికి చేరుకుంటున్నారు. వీరందరూ అవధాని గారి కింద పని చేస్తారు. ఆయనే వీరికి దారి చూపిస్తాడు. వీరివే బ్రాంచీలు చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి గుడి దగ్గరా, సికిందరాబాద్ స్టేషన్ దగ్గరా వున్నాయి.

సంధ్యావందనం చేసి, సహస్రగాయత్రి పూర్తి చేసుకొని, నీర్కావి పంచె కట్టుకొని, దర్భపుల్లలు చేబూని అక్కడకు చేరుకున్నాడు తిలదానం సుబ్బయ్య.

"రా రా! సుబ్బయ్య తాతా! ఈ రోజు తిలదానాలేవీ వచ్చేట్లు లేదే?!"-ఎకసక్కెంగా అంటూ పక్కకు జరిగి చోటిచ్చాడు కోటయ్యశాస్త్రి. ఆయనకు ముప్పై ఐదేళ్లుంటాయి. పుటకకు బ్రాహ్మణుడు. వృత్తి పౌరోహిత్యం. అయినా గాయత్రి కూడా పూర్తిగా రాదు. ఏ నాడూ సంధ్య వార్చడు. అపస్వరాలతో కూడిన మంత్రాలు వల్లిస్తూ, మిడిమిడిజ్ఞానంతో-క్రతువునైనా జరిపించగల బ్రతకనేర్చిన మనిషి. శుభాశుభాలకు ఒకే మంత్రం వేరే ఉచ్చారణతో చెప్పి కార్యం గట్టెక్కించగల దిట్ట. ఒకే రోజు రెండిళ్లలో తద్దినాలు పెట్టించి, మూడో ఇంటికి భోక్తగా వెళ్లగల సమర్థుడు! అందుచేతనే ఆ బజార్లో ఇల్లు కొనగలిగాడు. స్థలాలు కొనగలిగాడు.

మాట్లాడకుండా అతడి పక్కన చతికిలబడ్డాడు సుబ్బయ్య. అంటు పడతానేమో నన్నట్లు దూరంగా జరిగాడు కోటయ్యశాస్త్రి.

"ఏమిటోనోయ్ కృష్ణమూర్తీ! శనిదానం పట్టేవాళ్లంటే నాకు పరమఅసహ్యం. అవసరార్థం గృహస్థు తృణమో, పణమో ఇచ్చినా, వాడి శనిని మనమెట్లా పొందుతాం?" పక్కకు తిరిగి అన్నాడు.

"అందుకే గదుటోయ్ శాస్త్రీ, శనిదానాలు పట్టేవాళ్లు ఎప్పుడూ దరిద్రపు మొఖమేసుకుని వుంటారు!"నవ్వాడు కృష్ణమూర్తి.

"దాందేముంది బాబూ? శనిజపం, సహస్రగాయత్రి చేస్తే ఆ దోషం పోతుంది కదా!" సుబ్బయ్య అన్నాడు.

"ఆఁ! మనం చేసే చచ్చినప్పుడు కదా నా శ్రాద్ధం! అవి ఎందరు చేయగలరు?" నవ్వాడు కోటయ్యశాస్త్రి.


సుబ్బయ్యకు అర్థం కాని దొకటుంది. క్రిస్టియన్ ఫాదర్‌ను ఎవరూ గేలి చేయరు. ముల్లాను అగౌరవపరుస్తూ ఎవరూ మాట్లాడరు-ఆఖరికి నాస్తికులు కూడా! అదేం చిత్రమో కాని, హిందూపూజారిని అందరూ అవహేళన చేస్తారు. ఆయన పిలక పైన ఏదో వ్యాఖ్యానిస్తారు. ఆఖరుకు ఒక మెట్టు పైకెక్కిన బ్రాహ్మణులు కూడా!

"బాబూ! నే చెప్పింది గుర్తుందా?" అడిగాడు సుబ్బయ్య.

"ఏమిటి?" ప్రశ్నించాడు కోటయ్యశాస్త్రి.

"అదే బాబూ! నాకు మనవడు పుట్టాడు కదా. మూలానక్షత్రం. నవగ్రహశాంతి ఘనంగా చేయాల్సివుంటుంది. లేకుంటే తండ్రికో, తాతకో ప్రమాదం. అదీ నక్షత్రం తిరిగేలోగా చేయాలి. ఎల్లుండితో ఆ గడువు ముగుస్తుంది. నా పరిస్థితి మీకు తెలుసును గదా! మీరు కొంత సాయం చేయాలి. మీరంతా నవగ్రహదానాలకు వచ్చి నేనివ్వగలిగేది మీరు సంతోషంగా పుచ్చుకోవాలి."

"ఎట్టెట్టా-సుబ్బయ్యా? తిరిపమెత్తే నీవు నవగ్రహశాంతి ఎలా చేయగలవు? కనీసం భోజనం కూడా సరిగా పెట్టలేవే! మరి దక్షిణగా ఏం ఇస్తావ్? తద్దినానికి భోక్తగా పోతేనే ఏభై రూపాయల దక్షిణ ఇస్తున్నారు. సత్యనారాయణస్వామి వ్రతం చేయిస్తే రెండొందల పదహార్లు. పెళ్లి చేయిస్తే రెండు వేల నూటపదహార్లు. అపరకర్మలు చేయిస్తే ఇంకా ఎక్కువ. శాంతి అంటే తొమ్మిది గ్రహాలకు జపం జరగాలి. హోమం చేయాలి. మంత్రం చెప్పాలి. దీన్ని నీవేం



భరించగలవు చెప్పు? వద్దులే తాతా! మానుకో!"

"కాదు బాబూ! సాటివాడిని. మీరు సాయపడకపోతారా అని... శాంతి చేయించకుంటే చాలా ప్రమాదం!"

"సింగినాదం! ఇవన్నీ మూఢనమ్మకాలయ్యా! శాంతి చేయించకుండా వున్నా, ఏం కాదు. భయపడకు! మేమొక రోజు రావాలంటే మృష్టాన్నభోజనం, కనీసం ఏభైరూపాయలు పోగొట్టుకోవాలి. ఇంతమందిమి ఎలా రాగలమయ్యా?" సూటిగా ప్రశ్నించాడు కోటయ్యశాస్త్రి.

"అంటే-మీరు చేయించేవన్నీ నమ్మకాలుండి కాదన్నమాట!?" ఆశ్చర్యపోతూ అన్నాడు సుబ్బయ్య.

పెదవి విరిచాడు కోటయ్యశాస్త్రి. "మనకు నమ్మకాలుంటేనేం, లేకుంటేనేం-చేయించుకునే వారికుంటే చాలదా? మన బ్రతుకు తెరువు మనది. ఇదో సుబ్బయ్యా, పోయి అవధాని గారితో చెప్పు. ఏమైనా సాయం చేయగలడేమో!" అంటూ తిరిగి కూర్చుని, పై పంచెతో మోకాలినీ, వీపునూ కలిపి కట్టుకుని నస్యం తట్టించి చెప్పాడు కోటయ్యశాస్త్రి.

నెమ్మదిగా కదిలాడు సుబ్బయ్య అవధానులు ఇంటి వైపు.

తన ఆఫీస్ గదిలో రివాల్వింగ్ కుర్చీలో కాషాయాంబరాలు, నుదుటా, చేతులకూ విభూతి, మెడలో మూడు రుద్రాక్షమాలలు ధరించి, బల్ల ముందు కూర్చుని దినపత్రిక చూస్తున్నాడు అవధాని. ఆయన ముందు రెండు టెలిఫోనులు వున్నాయి. అక్కడుండే పురోహితులందరికీ పెద్ద ఆయన. ఎం.ఎల్.ఏ.లూ, మంత్రులూ, ఐఏఎస్ ఆఫీసర్లూ, సినిమాతారలూ, పెద్ద పారిశ్రామికవేత్తల ఇళ్లకు మాత్రం స్వయంగా వెళతాడు. మిగతా కార్యాలకు తన మనుషులను పంపుతాడు. వారికొచ్చే దక్షిణలో ఈయనకు కొంత వాటా వుంటుంది.

అడుగుల చప్పుడు విని దినపత్రిక లోంచి తలెత్తి చూశాడు అవధాని. "ఓ! తిలదానం సుబ్బయ్యా? ఏమిటిలా వచ్చావు?" కనీసం కూర్చోమని అనకుండానే అన్నాడు.

సుబ్బయ్య పరిస్థితి వివరించాడు.


"నీవు ఏమీ ఇవ్వకుండా కార్యం జరపమంటే ఎలా? పోనీ మిగతా గ్రహజపాలకు ఎవరో పిల్లల్ని పంపినా, శనిదానం తీసుకునే దెవరయ్యా? నీవు తప్ప ఇక్కడెవరూ లేరే? సికిందరాబాద్‌లో నలుగురైదుగురు వున్నారు గాని, ఇనపముక్కలు కాని ముట్టరే! మరేం చేద్దాం చెప్పు? నీవైతే ఎంత ఇచ్చినా తీసుకుంటావు. కాని వారలా కాదే? నేనేం చేయను? డబ్బు చూడు ఎక్కడైనా!"

"తిరిపమెత్తేవాడు ఏం డబ్బు సాధించగలడు?" నమ్రంగా అన్నాడు సుబ్బయ్య.

"శిరోదర్శనం అయిన ఘడియలు చూద్దామంటే-మూలానక్షత్రం... బిడ్డకో, తండ్రికో, తాతకో మృత్యువు తప్పదు! నీ కొడుకు నక్సలైట్లలో చేరాడట కదా! డబ్బేం పంపలా? అయినా వాడు ఏదో ఎన్‌కౌంటర్‌లో పోక తప్పదు కదా! అదెటూ జరిగేదైనప్పుడు ఇంకా శాంతి ఎందుకు డబ్బు దండగ?"

"అది తప్పించాలనే బాబూ, నా ప్రయత్నం! అదీ నక్షత్రం తిరిగొచ్చేలోగా చేయాలి. అదీ ఎల్లుండితో ముగుస్తుంది."

"అదేవిటీ? మూడు రోజులుందిగా ఇంకా?" అంటూనే పంచాంగం తీసి చూశాడు అవధాని. "ఇదుగో చూడు, ఈ పంచాంగంలో ఏం రాసి వుందో!"




"ఆ లెక్క తప్పు బాబూ!"

"ఇది రాసినాయన బ్రహ్మశ్రీ వేదమూర్తులైన సచ్చిదానందసిద్ధాంతి నా గురువు గారు! వారి లెక్కలు తప్పంటావా? ఇదో చూడు" మరో పంచాంగం తీసి చూపించాడు అవధాని-"చూశావా, దీనిలోనూ అదే రాసి వుంది! ఇంకా మూడు రోజుల గడువుంది."

"అది తప్పు బాబూ!"

కనుబొమలు పైకెత్తి చూశాడు అవధాని. "అన్ని పంచాంగాలూ తప్పంటావు-నీకేం తెలుసు? నువ్వేం పండితుడివా? జ్యోతిశ్శాస్త్రవేత్తవా? ఆఫ్టరాల్ శనిదానం పట్టే ఒక బాపడివి. పెద్దలను విమర్శించేటంత అహంకారం పెంచుకోకు!" కటువుగా అన్నాడు.

చిరునవ్వు నవ్వాడు సుబ్బయ్య. "నా లెక్క తప్పు కాదు బాబూ! కావాలంటే 'ఎస్ట్రనామికల్ జర్నల్' ఒక్కసారి తిరగేసి చూడు. ఈ నెలలో గురుగ్రహానికి 'లూప్' వుంది. అందుచేత కాలం ముందుకు జరుగుతుంది" అంటూనే బయటకు నడిచాడు సుబ్బయ్య.

వెళుతున్న అతన్ని చూసి చిరాకుగా దినపత్రికలో తల దూర్చాడు అవధాని. మళ్లీ ఏమిటో సందేహం వచ్చినట్టయి ఫోన్ అందుకున్నాడు. ఉస్మానియా యూనివర్శిటీలో ఖగోళశాస్త్రవిభాగంలో ఒక లెక్చరర్ ఆయన శిష్యుడు. ఆయనకు ఫోన్ చేసి విషయం అడిగాడు.

జర్నల్ పరిశీలించి "నిజమే"నని చెప్పాడాయన.

అవాక్కయాడు అవధాని! అంటే, ఇద్దరు పంచాంగకర్తలు రాసిన దానికంటే-వేళ్లతో లెక్కించి స్వతహాగానే చెప్పగల మేధావా సుబ్బయ్య? తను గాని, తన శిష్యులు గాని ముహూర్తాల దగ్గర్నుండి తద్దినాల వరకూ వాటి పైనే ఆధారపడతారు. అవే తప్పయితే? కేవలం నోటిలెక్కలతో గ్రహస్థితులు కచ్చితంగా చెప్పగలిగాడంటే ఆయన మహాపురుషుడు!

అవధానికి జ్ఞానోదయమైంది. గబగబా కుర్చీ లోంచి లేచి, శిష్యులను పిలిచి-"వెంటనే సుబ్బయ్య గారెక్కడ వున్నా తీసుకుర"మ్మని ఆజ్ఞాపించాడు. కాని ఆయన కనిపించలేదు.

ఆయన చిక్కడపల్లిలో, సికిందరాబాద్‌లో ఎందరో పురోహితులను బతిమిలాడాడు. కాని ఎవరూ అంగీకరించలేదు. తిలదానం స్వీకరించే వ్యక్తే కరవయ్యాడు.

ప్రతి చోటా పౌరోహిత్యం వ్యాపారంలా కనిపించింది తప్ప, చిత్తశుద్ధితో చేసేవారే కరవయ్యారు. ఎక్కువ డబ్బులిస్తే తప్ప తిలదానం స్వీకరించటానికి ఎవరూ ఇష్టపడలేదు. కొందరైతే అదో నీచమైనపనిలా మాట్లాడారు. నిజమైన బ్రాహ్మణునికి వుండకూడని అహంకారం, భేషజం, దర్పం ఎక్కువమందిలో వున్నాయి. నమ్రత, మధురసంభాషణ లోపించాయి. 'బ్రాహ్మణులంటే సమాజంలో ద్వేషం కలగటానికి ఇదో కారణం కావచ్చు'ననుకున్నాడాయన. ఇంటికి చేరేసరికి రాత్రి పది గంటలైంది.

పద్మావతి భోజనం చేయకుండా మామగారి కోసం ఎదురుచూస్తోంది. బిడ్డ శరీరం జ్వరంతో కాలిపోతూంది.

"రేపు జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లమ్మా!" భోంచేస్తూ చెప్పాడాయన.

పడుకున్నా ఆయనకు నిద్ర పట్టలేదు. శాంతి జరపకపోతే అనర్థం తప్పదు! శాంతి జరిపే అవకాశం లేదు. ఏం చేయాలి?

తనకు తెలిసిన ధర్మశాస్త్రాలన్నీ నెమరు

వేసుకున్నాడాయన. అనేకప్రశ్నలుదయించా యాయనలో.

కృష్ణుడు ఒక కులం వారి ఇలువేల్పు. కన్యకాపరమేశ్వరి మరో కులం వారి ఇలువేల్పు. అంకమ్మ దేవత ఒక కులం వారికీ, చాముండేశ్వరి మరో కులం వారికీ ఇలువేల్పులు. శ్రీ వైష్ణవుల దేవతలు వేరు. శైవుల దేవుళ్లు వేరు. లింగాయతుల దేవతలు వేరు. వీరబ్రహ్మం గారు ఒక కులం వారి దేవత. బాబాలు కొందరికి వేల్పులు. దేవతలలోనే ఇన్ని కులాలుండగా చంద్రస్వామి, రజనీశ్, అవధాని లాంటి ఖరీదైన స్వాములెందరో!

మానవునిలోని సంకుచితభావాలకు తార్కాణాలా? కులం, మతం, జాతి, దేశం-ఇలా మనుషులంతా విడిపోయి వున్నారు. ఎలా చూసినా మానవులను రెండుగానే విభజించవచ్చు. స్త్రీ-పురుషుడు. ఉన్నవారు-లేనివారు. అంతే!

000

ఈ విభజన కులం, మతం, జాతి, దేశం అన్నిటికీ అతీతంగా నిలుస్తుంది. అలాంటప్పుడు నవగ్రహాలకు శాంతి జరపకపోతేనేం? సకలదేవతల ప్రీత్యర్థం ఒక క్రతువు చేస్తే సరిపోదా?

అదే కదా వేదసారం? తర్కసిద్ధాంతం! లేక 'చార్వాకుని' వాక్కులే నిజమా?

ఆలోచనలతో మాగన్నుగా నిద్ర పట్టిందాయనకు.

000

పద్మావతి బయట ముగ్గు వేసి వచ్చేసరికి, కింద చాప మీద పద్మాసనం వేసుకుని కూర్చుని వున్నాడు సుబ్రహ్మణ్యశాస్త్రి. ఆయన కళ్లు జ్యోతుల్లా వున్నాయి. ఎదుట కొంచెం మట్టి పోసి చుట్టూ ఇటుకలు పేర్చి, స్థలపూజ చేస్తున్నాడాయన.

వేదమంత్రాలతో ఆయన కంఠం కంచుఢక్కలా మోగుతోంది. ఆయన దృష్టి మరి దేని మీదా లేదు. మధ్యలో ఒక తమలపాకు పైన పసుపుతో లింగాకారాన్ని చేసి, విఘ్నేశ్వరావాహన ప్రారంభించాడు.

తరువాత చితుకులు వేసి ఆజ్యం పోసి అగ్నిని వెలిగించి, దిక్పాలకులను ఆవాహన చేశాడు. అప్పటికే అక్కడికి చేరిన అవధాని, శిష్యబృందం ఆయనకేసి విచిత్రంగా చూస్తున్నారు. తిలదానం పట్టే వ్యక్తి శవవాహకుడు... ఒక క్రతువు నిర్వహించటమా?


సుబ్రహ్మణ్యశాస్త్రి వారినెవరినీ పట్టించుకోలేదు. ఆయన చూపులు అగ్నిలోకి వున్నాయి- తమలపాకులో ఖర్జూరపువండు, వక్కలు వుంచి నవగ్రహాలనూ వేదోచ్ఛారణతో ఆహ్వానిస్తున్నాడు.

వేదపఠనం గంభీరంగా సాగుతోంది. వేదాలు కొద్దిగా చదివినవారు అక్కడక్కడా ఆయనతో గొంతు కలపటానికి ప్రయత్నించి విఫలులయ్యారు, ఆయన వాక్పటిమకూ, శ్వాసతో కూడిన నిర్దిష్టమైన లయకూ, నాసికతో, గళంతో, నాలుక చివరతో, ఉచ్ఛారణ మారుస్తూ ఉచ్ఛస్వరంతో కొనసాగుతున్న ఆ మంత్రపఠనానికి చిత్తరువు లయ్యారు.

కొందరు పండితులు ఆయన గొప్పతనాన్ని గుర్తించి, హోమగుండం చుట్టూ కూర్చుని దర్భలందించటానికీ, ఆజ్యం పోయటానికీ సాయపడసాగారు.

లోపల గదిలో పసిబిడ్డ శరీరం జ్వరంతో పేలాలు వేగేలా వుంది. కన్నీళ్లతో బిడ్డను అక్కున చేర్చుకుంది పద్మావతి.

అంతలో ఎవరో కుర్రవాడు వచ్చి ఆమె కో ఉత్తరం ఇచ్చాడు. విప్పి చూసింది పద్మావతి.




"పద్మా!

"నేనెంచుకున్న మార్గం సరైనదేనని నా నమ్మకం. కానీ నా మీద ఆధారపడిన మిమ్మల్ని బజారుపాలు చేయటం నైతికసూత్రానికి విరుద్ధం.

"మనది వికృతసమాజం. దోపిడిని గుర్తించినా ఎదిరించక, సహించే సమాజం. అంతా స్వార్థం! చివరికి మా గ్రూపుల్లోనూ చీలికలొచ్చాయి. ఒకే సిద్ధాంతం కలిగిన మేమే కలిసి విప్లవం కోసం పోట్లాడలేకపోతే, మరి ఇన్ని కోట్ల ప్రజానీకానికి చైతన్యపుదారి ఎలా చూపించగలం?

"ఇప్పుడు నా కుటుంబం కోసం ఏదైనా చేద్దామనుకుంటున్నాను. ఏ బ్యాంకునో దోచిన డబ్బు మీ కివ్వగలను. ఏ భూస్వామి ఇనపెట్టెలలో మగ్గుతున్న నల్లధనాన్నో మీ కివ్వగలను. కాని అది నా సిద్ధాంతానికే వ్యతిరేకం! అందుకని నన్ను నేనే అమ్ముకుంటున్నాను.

"నా తల విలువ ఏభై వేలు! అది ప్రభుత్వం ప్రకటించిన బహుమానం! నేను నా స్నేహితుడు రమేష్ ద్వారా ఈ రోజు పోలీసులకు లొంగిపోతున్నాను. రమేష్ ఆ డబ్బు తెచ్చి మీకిస్తాడు. దానితోనైనా సుఖంగా బ్రతకండి. నా బిడ్డకు మంచి భవిష్యత్తునివ్వు. నాన్న ఛాందసుడు. ఆయన నమ్మకాలు ఆయనవి. ఆయనను ఎవరూ మార్చలేరు. నీవు ఆయనను జాగ్రత్తగా చూసుకో. మన ప్రేమచిహ్నాన్ని, మన చిన్నారిబిడ్డను వెంటనే డాక్టర్‌కు చూపించు. ఎన్‌కౌంటర్లో మరణించకుండా వుంటే మళ్లీ కలుద్దాం. ఉంటాను మరి.

"నీ

"రఘురాం."

పద్మావతి చెక్కిళ్ల పైన నీరు ధార కట్టింది. బిడ్డ జ్వరంతో వెక్కుతున్నాడు.

క్రతువులో నిమగ్నమైన మామగారి చెంత ఆ లేఖ నుంచి. బిడ్డను తీసుకుని ఆస్పత్రికి వెళ్లింది పద్మావతి.

వెంటనే బిడ్డను వార్డ్‌లో చేర్చుకున్నారు. ఆ రోజంతా అక్కడే వుండిపోవాల్సివచ్చిం దామెకు. మరునాటి ఉదయం పేపర్లో "కరుడు గట్టిన ఉగ్రవాది పట్టివేత" అనే శీర్షిక కింద రఘురాం ఫోటో అచ్చయింది. పక్కనే రమేశ్‌కు ఏభైవేల రూపాయల బహుమానం అందజేసినట్లుగా రాసి వుంది.

గాఢంగా నిట్టూర్చింది పద్మావతి.

మూలానక్షత్రం వెళ్లిపోయింది. బాబును డిశ్చార్జి చేశారు.

బిడ్డను తీసుకుని ఇంటికి వచ్చింది పద్మావతి.

ఇంటి బయట జనం! ఎందరో బ్రాహ్మణులు! బ్రహ్మశ్రీ, వేదమూర్తులైన సుబ్రహ్మణ్యశాస్త్రి గారి భౌతికకాయానికి ఘనంగా నివాళులిస్తున్నారు. అవధానే పూనుకొని అన్నీ చేస్తున్నాడు.

తిలదానం పట్టేవాడికి, తిలదానం పట్టేవాడు దొరక్కపోయినా, శవవాహకునికి శవవాహకులు లభించారు! అదీ శ్రోత్రియబ్రాహ్మణులు! క్రతువు పూర్తి చేస్తూనే, యోగంలో ప్రాణాలు విడిచిన ఆయనకు వీరిచ్చే నివాళి అది!

భోరున విలపిస్తూ వుండిపోయింది పద్మావతి. జరుగుతున్న తతంగాన్ని నిర్వేదంగా చూస్తుండిపోయింది.

మరుసటి రోజు ఆమె కళ్లు రమేశ్ కోసం ఎదురుచూశాయి.

అలా చూస్తూనేవున్నాయి.

కాని, అతడెప్పటికీ రాడని ఆమెకు తెలియదు! డబ్బు పాపిష్టిది కదా మరి!

■